యోగానందుడికి హనుమంత వాహన సేవ

హనుమంత సేవ నిర్వహిస్తున్న అర్చకులు

అర్వపల్లి, మార్చి 1 : అర్వపల్లి యోగానంద లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి హనుమంత సేవ, స్వామి వారికి చందనార్చన, శుక్రవారం ఉదయం రాజ్యలక్ష్మి గోదాదేవికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం హనుమ వాహనంపై స్వామి అమ్మవార్లను పుర వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవాలయ ఉత్సవ కమిటీ చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, అర్చకులు రాంబాబు, పవన్ పాల్గొన్నారు.

బేతవోలులో జాతీయ స్థాయిలో ఎడ్ల పందేలు

బేతవోలులో ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మావతి

చిలుకూరు, మార్చి 1 : మండల పరిధిలోని బేతవోలులో కనకదుర్గమ్మ జాతర వైభవంగా కొనసాగింది. శుక్రవారం తెల్లవారుజాము నుంచే గ్రామంలో ప్రభలు ఊరేగింపుగా దేవాలయానికి చేరి ప్రదక్షణలు చేశాయి. అనంతరం అమ్మవారికి భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఎడ్ల పందేలను ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆశీస్సులు అందరిపై ఉండాలి

ప్రజలపై కనకదుర్గమ్మ ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని బీఆర్ఎస్ కోదాడ నియోజకవర్గ నాయకుడు పచ్చిపాల వేణుయాదవ్ అన్నారు. బేతవోలులో కనకదుర్గమ్మ జాతర సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోలాట ప్రదర్శనను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు జానిమియా, తాళ్లూరి శ్రీను, అక్కినేని జానకిరామాచారి, లక్ష్మీనారాయణ, ప్రసాద్, కాశీగౌడ్, నాగరాజు, కుర్రా అచ్చయ్య పాల్గొన్నారు.

రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోవాలి

- తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి

రైతు నుంచి ధరఖాస్తు స్వీకరిస్తున్న తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్, మార్చి 1 : రైతులు పట్టాదార్ పాస్‌పుస్తకాల్లో సమస్యలు, భూ సమస్యలు ఉన్నట్లయితే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక ధరణి స్పెషల్ డ్రైవ్‌లో సమస్యలను పరిష్కరించుకోవాలని తాసీల్దార్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తాసీల్దార్ కార్యాలయంలో ఈ 9 వరకు జరిగే భూ సమస్యల ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించారు. వివిధ భూ సమస్యలతో వచ్చిన రైతుల నుంచి ధరఖాస్తులను స్వీకరించి మాట్లాడారు. భూ సమస్యలపై రైతులు తగిన ఆధారాలతో తాసీల్దార్ కార్యాలయానికి వచ్చి పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెంపు

- వ్యవసాయ శాస్త్ర వేత్త నరేశ్

కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త నరేశ్

తుంగతుర్తి, మార్చి 1 : ప్రకృతి వ్యవసాయం ద్వారా భూసారం పెంపొందుతుందని కేవీకే గడ్డిపల్లి సీనియర్ శాస్త్రవేత్త, హెడ్ ఇన్‌చార్జి డి.నరేశ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని రావులపల్లి ఎక్స్‌రోడ్‌తండాలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. రైతులు సేంద్రీయ వ్యవసాయం చేయడం వల్ల ఖర్చు తగ్గి నేల ఆరోగ్యం పెంపొందుతుందన్నారు. సేంద్రీయ వ్యవసాయంతో పండించే పంటకు అధిక ధర కూడా వస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్, సీహెచ్.నరేశ్, ఆదర్శ్, తుంగతుర్తి మండల ఉద్యాన అధికారి వి.స్రవంతి, ఏఈఓ సీహెచ్.శ్రీజన పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద మృతులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు వెంకటేశ్వర్‌రావు

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వరావు

మునగాల, మార్చి 1 : మోతె మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గాయపడ్డ వారికి ఉచితంగా మెరుగైన చికిత్స అందించాలన్నారు. వారిని ప్రభుత్వం ఆదుకోకపోతే పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో దేవరం వెంకట్‌రెడ్డి, సైదా, ముత్యాలు పాల్గొన్నారు.

విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలి

- ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి

శ్రమదానం చేస్తున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు

హుజూర్‌నగర్, మార్చి 1 : విద్యార్థులు సమాజ సేవలో ముందుండాలని హుజూర్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భీమార్జున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రాయినిగూడెం, కాల్వపల్లిలో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రమదానం చేసి ఊరిలోని పాఠశాల పరిసరాలను శుభ్రం చేశారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ పసుపుల మద్దిలేటి, పాఠశాల హెచ్ఎం జానకిరెడ్డి, వెంకట్‌రెడ్డి, ప్రత్యేక అధికారి కురువయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాస్‌రావు, డాక్టర్ నగేశ్, వాలంటీర్లు పాల్గొన్నారు.

మునగాల మండల రేషన్ డీలర్ల అధ్యక్షులిగా రమాదేవి

మునగాల, మార్చి 1 : మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షురాలిగా కేశగాని రమాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. తనతో పాటు గౌరవ అధ్యక్షుడిగా గొల్లపూడి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా తాటికొండ సంజీవరెడ్డి, కోశాధికారిగా పాశం రామేశ్వరిని సంఘం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రేషన్‌షాపు డీలర్లు మద్ది మల్లికార్జున్, శ్రీదేవి, నాగమణి, వెంకన్న పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం

- ఎమ్మెల్యే మందుల సామేల్

ఫణిగిరిలో ఉద్యోగ ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నాగారం, మార్చి 1 : విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఫణిగిరిలో గల ఆనంద్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ఉన్నత విద్య అందుబాటులో ఉండేలా తిరుమలగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోత్కూరులో డిగ్రీ కళాశాల మంజూరు చేయించినట్లు తెలిపారు. సమాజంలో ఉపాధ్యాయులది ఉన్నతమైన స్థానమని కొనియాడారు. ప్రతి ఏడాది దాదాపు 50 మంది పిల్లలను స్కూల్లో చేర్పించడం తన దినచర్యలో భాగమని చెప్పారు. అవకాశం వస్తే రుద్రమచెరువును రిజర్వాయర్‌గా మారుస్తానని తెలిపారు. కార్యక్రమంలో సభాధ్యక్షుడు ఇటికాల రవీందర్, ఎస్సీ ఎస్టీ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు కొంపెల్లి భిక్షం, ఎంఈఎఫ్ రాష్ట్ర సెక్రటరీ జానకిరాములు, టీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, కడారి సతీశ్, వివిధ మండలాల తాసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు పాల్గొన్నారు.

పెద్దిన్ చెరువుపై సమగ్ర దర్యాప్తు

వర్ధమానుకోట గ్రామంలోని పెద్దిన్ చెరువు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. నాగారం ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో విలేకరులు ఫణిగిరి గ్రామంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. వర్ధమానుకోటలోని పెద్ద చెరువు నుంచి చేపల కాంట్రాక్టర్ అక్రమంగా నీటిని విడుదల చేస్తున్నాడని అందుకు సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు సహకరిస్తున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కొందరు డీఈ పిచ్చయ్యను తప్పుదోవ పట్టిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే స్పందిస్తూ నియోజకవర్గంలో సహజ వనరుల పరిరక్షణలో రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. అలాగే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, భద్రతకు హామీ ఇచ్చారు.

పోలియో నిర్మూలనకు సహకరించాలి

- సూపరింటెండెంట్ డాక్టర్ నిర్మల్‌కుమార్

తుంగతుర్తి : పోలియో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

తుంగతుర్తి, మార్చి 1 : పోలియో నిర్మూలనకు అంతా సహకరించాలని ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చింతమల్ల నిర్మల్‌కుమార్ కోరారు. ఈ నెల 3న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించి మాట్లాడారు. తుంగతుర్తి ఆరోగ్య కేంద్రం పరిధిలో 4 రూట్లలో 36 పోలియో చుక్కల కేంద్రాల్లో 0–5 పిల్లలు 4,374 మందికి వేయడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. హెచ్ఈఓ సముద్రాల సూరి, రవికుమార్, డీపీఎంఓ సురేశ్, పీహెచ్ఎన్ సైదమ్మ, హెచ్‌వీ జానకమ్మ, నవీన్, వేణుగోపాల్, హెల్త్ అసిస్టెంట్లు ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ డాక్టర్ వందన కోరారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. మండలంలో 3,102 మంది 0–5 సంవత్సరాల పిల్లలను గుర్తించడం జరిగిందన్నారు. 20 పోలియో చుక్కల కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 80 మంది వ్యాక్సినేటర్లు, ఇద్దరు రూట్ సూపర్‌వైజర్లు, ఒక మొబైల్ టీమ్ ద్వారా పోలియో చుక్కల కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని సూర్యాపేట–దంతాలపల్లి ప్రధాన రహదారిపై వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారి ఆశిత రెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులకు వేసే రెండు చుక్కల మందు భవిష్యత్‌లో రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తున్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టపల్లి నృసింహుడి నిత్య కల్యాణం

కల్యాణతంతు నిర్వహిస్తున్న అర్చకులు

మఠంపల్లి, మార్చి 1 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని అర్చకులు శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ముందుగా స్వామి అమ్మవార్లకు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణ మండపంలో కల్యాణతంతు నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై ఆలయ పుర వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, ఈఓ నవీన్, ఆలయ అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పీఎం–సూర్య ఘర్ రిజిస్ట్రేషన్లు ప్రారంభం

అర్వపల్లి, మార్చి 1 : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రూఫ్‌టాప్ సౌర విద్యుత్ పథకం పీఎం–సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకానికి పోస్టాఫీసు అధ్వర్యంలో రిజిస్ట్రేషన్లు ప్రారంభించినట్లు తపాల శాఖ సూర్యాపేట ఈస్ట్ సబ్ డివిజన్ అధికారి గౌని సురేశ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని తపాల కేంద్రంలో 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించే ఈ పథకానికి రిజిస్ట్రేషన్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పథకానికి రూ.1.80 లక్షలు కాగా ఇందులో రూ.78 వేలు సబ్సిడీ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వినియోగదారులు పోస్టల్ సిబ్బందికి వివరాలు అందిస్తే వారు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాక సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం

- ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

బొడ్రాయిబజార్ : మాదిగ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు

బొడ్రాయిబజార్, మార్చి 1 : ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేస్తామని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకులు అన్నారు. మాదిగ అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో ఎస్సీ వర్గీకరణలో అసువులు బాసిన మాదిగ అమరవీరులకు ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు యాతాకుల రాజన్నమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు చింత వినయ్ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన మాదిగ అమరవీరుల త్యాగం వృథా కానివ్వమని, వారి ఆశయ సాధన కోసం పోరాడుతామన్నారు. నాయకులు చింతలపాటి చిన్న శ్రీరాములు, ఎర్ర వీరస్వామి, బోడ శ్రీరాములు, ముల్కలపల్లి రవి, కనుకుంట్ల వెంకన్న, బొడ్డు విజయ్, గ్యార కనకయ్య, పుట్టల మల్లేశ్ పాల్గొన్నారు.

ఏబీసీడీ వర్గీకరణకు ఉద్యమించాలి

నేరేడుచర్ల : ఏబీసీడీ వర్గీకరణ కోసం మాదిగలంతా ఐక్యంగా ఉద్యమించాలని ఎమార్పీఎస్ మండలాధ్యక్షుడు యడవల్లి అరుణ్ పిలుపునిచ్చారు. మాదిగల అమరవీరుల దినోత్సవం సందర్భంగా స్థానిక చౌరస్తా వద్ద అమరవీరుల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వడ్డేపల్లి కోటేశ్, సత్యరాజు, ఒగ్గు ఏసోబు, సూరి, కనకయ్య, గోపి, గద్దల సాయికుమార్ పాల్గొన్నారు.

చింతలపాలెం : ఎస్సీ వర్గీకరణ సాధించే వరకు పోరాటం చేస్తామని హుజూర్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నాయకుడు కొండపల్లి ఆంజనేయులు అన్నారు. మండలంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద మాదిగ అమరవీరుల చిత్రపటాలకు నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు బాల చంద్రుడు, యేసు, నాగేశ్వర్‌రావు, ప్రశాంత్ పాల్గొన్నారు.

కోదాడ రూరల్ : ఎస్సీ వర్గీకరణ సాధనలో అసువులు బాసిన మాదిగ అమర వీరుల స్ఫూర్తిని కొనసాగిస్తూ వర్గీకరణ సాధించుకుందామని ఎంఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఏపూర రాజు అన్నారు. కోదాడ పట్టణ ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో మాదిగ అమర వీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వడ్డేపల్లి కోటేశ్, సత్యరాజు, ఒగ్గు ఏసోబు, సూరి, కనకయ్య, గోపి, గద్దల సాయికుమార్ పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల్లో నిమిషం నిబంధన ఎత్తివేయాలి

- ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు వెంకట్

నేరేడుచర్ల, మార్చి 1 : ఇంటర్ పరీక్షల్లో ఒక్క నిమిషం నిబంధనను ఎత్తివేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు కొమ్మరాజు వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నిమిషం నిబంధన వల్ల ఎంతో మంది విద్యార్థులు ఉజ్వల భవిష్యత్‌ను కోల్పోతున్నట్లు తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న ఇంటర్ విద్యార్థి శివకుమార్ కుటుంబానికి రూ.25 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

- కాంతినికేతన్ అధ్యక్షుడు క్రాంతికుమార్

నేరేడుచర్ల, మార్చి 1 : మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ నుంచి కమలానగర్ వరకు రోడ్డు అధ్వానంగా తయారైందని తక్షణమే మరమ్మతులు చేపట్టాలని పెంచికల్‌దిన్నె మాజీ సర్పంచ్, క్రాంతినికేతన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సుంకరి క్రాంతికుమార్ అధికారులను కోరారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నేరేడుచర్ల పట్టణం నుంచి సుమారు 10 గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి అధ్వాన్నంగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి ప్రత్యేక బడ్జెట్ కేటాయించి రోడ్డు పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు.

'90 శాతం రాయితీతో ఇంటి పన్నులు చెల్లించవచ్చు'

తిరుమలగిరి, మార్చి 1 : తొంభై శాతం వడ్డీ మాఫీతో ఇంటి పన్నులు చెల్లించవచ్చని తిరుమలగిరి మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీలో 2022–23 ఆర్థిక సంవత్సరం వరకు ఉన్నటువంటి ఇంటి పన్ను బకాయిలను 90 శాతం వడ్డీ మాఫీ చేస్తూ కేవలం 10 శాతం వడ్డీతో బకాయిలు చెల్లించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా కనకదుర్గమ్మ జాతర

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 1 : మండలంలోని కర్కకాయలగూడెంలో శుక్రవారం కనకదుర్గమ్మ జాతర అత్యంత వైభవంగా జరిగింది. గ్రామంలో ట్రాక్టర్ల పైన ప్రభలను ఏర్పాటు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో డీసీఎంసీ చైర్మన్ దొంగరి వెంకటేశ్వర్లు, కీతా ధనమూర్తి పాల్గొన్నారు.

ఈ 16న జాతీయ లోక్ అదాలత్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్

సూర్యాపేట లీగల్, మార్చి 1 : ఈ నెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ తెలిపారు. శుక్రవారం బ్యాంక్ అధికారులు, బీమా కంపెనీలతో న్యాయ సేవాధికార సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి.శ్రీవాణి, జూనియర్ సివిల్ జడ్జి జె.ప్రశాంతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.అశోక్, న్యాయవాదులు జె.శశిధర్, వి.సత్యనారాయణపిళ్లై, పి.వాణి పాల్గొన్నారు.

సజావుగా ఇంటర్మీడియట్ పరీక్షలు

- మూడోరోజు 8,274 మంది విద్యార్థులు హాజరు
- 605 మంది గైర్హాజరు

సూర్యాపేటలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

సూర్యాపేట అర్బన్, మార్చి 1 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు సజావుగా కొనసాగుతున్నాయి. మూడో రోజు ఫస్టియర్ ఇంగ్లీష్ పరీక్ష నిర్వహణ జరిగింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8,879 మంది విద్యార్థులకు గాను 8,274 హాజరు కాగా 605 మంది గైర్హాజరయ్యారు. జనరల్ గ్రూప్‌లో 7,116 విద్యార్థులకు 6,779 మంది హాజరు కాగా 337 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌లో 1,763 మందికి 1,495 మంది హాజరు కాగా 268 మంది గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులు ఏమి లేవని అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి జానపాటి కృష్ణయ్య పరిశీలించారు.

ఎస్వీఈఎస్‌లో ఉచిత వైద్య శిబిరం

ఆయా విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

బొడ్రాయిబజార్, మార్చి 1 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని అనారోగ్యాల బారి నుంచి బయటపడాలని వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ బి.ఎన్.రాజేశ్వర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో హైదరాబాద్ కిమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్డియాలజీ, ఆర్థో, పెడియాట్రిక్, గైనకాలజీ విభాగాల్లో సుమారు 600 మందికి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కిమ్స్ డాక్టర్ ఎం.మాధవి, సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ రోషన్‌కుమార్ జైస్వాల్, డాక్టర్ పి.ప్రణీత్, డాక్టర్ డి.హరిప్రసాద్, విజయ వర్ధన్‌రావు, జి.నిఖిళారెడ్డి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ముత్యాల రాజు, కళాశాల సెక్రటరీ ఎం.చంద్రశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా స్వపరిపాలన దినోత్సవం

స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

అర్వపల్లి, మార్చి 1 : మండల పరిధిలోని అడివెంల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రజా ప్రతినిధులుగా, అధికారులుగా, ఉపాధ్యాయులుగా విద్యార్థులు అలరించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కరుణాకర్, కరుణ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పని దినాలను పెంచాలి

- సీపీఐ మండల కార్యదర్శి ప్రభాకర్‌గౌడ్

నూతనకల్, మార్చి 1 : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పని దినాలను 100 నుంచి 200 రోజులకు పెంచాలని, కూలీలకు బీమా సౌకర్యం కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి తోట్ల ప్రభాకర్‌గౌడ్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎంఎంఎస్ విధానాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. రెండుసార్లు ఫొటోలు అప్‌లోడ్ చేసే నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్‌ను రద్దు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వీరమల్లు, రమణయ్య, సుధాకర్, నర్సింహ, అవిలయ్య, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఎరువుల గోదాం పరిశీలన

డీఎస్ఓను సన్మానిస్తున్న సంఘం చైర్మన్, సీఈఓ

చిలుకూరు, మార్చి 1 : మండలంలోని చిలుకూరు, బేతవోలు, పాలెఅన్నారం ప్రాథమిక సహకార సంఘాల్లోని ఎరువుల గోదాములను శుక్రవారం జిల్లా సహకార అధికారి పద్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులకు ఎరువుల ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడూ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సంఘంలో ఎరువులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో క్లస్టర్ అధికారి అంజయ్య, ఆడిట్ అధికారి అంబేద్కర్, చైర్మన్లు బాషం సైదులు, అల్సకాని జనార్ధన్, సీఈఓలు లక్ష్మీనారాయణ, పాషా, సిబ్బంది పాల్గొన్నారు.

కోదాడ పెయింటింగ్ వర్కర్స్ అధ్యక్షుడిగా శ్రీను

కోదాడ టౌన్, మార్చి 1 : పట్టణంలోని ఐఎన్‌టీయూసీ పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడిగా మేకల శ్రీను శుక్రవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెయింటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం శ్రీనును జిల్లా కాంగ్రెస్ నాయకుడు పార సీతయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు అమ్మరబోయిన కనకారావు, మాదాసు వెంకటేశ్, చింతల మధు, పీర్‌సాబ్, సురేశ్ పాల్గొన్నారు.

పాండునాయక్ మృతి తీరని లోటు

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణానాయక్

గరిడేపల్లి, మార్చి 1 : మండలంలోని లచ్యాతండా తాజా మాజీ సర్పంచ్ వాంకుడోతు పాండూనాయక్ మృతి తీరని లోటని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుగులోతు కృష్ణానాయక్ అన్నారు. పాండూనాయక్ గురువారం రాత్రి హార్ట్ ఎటాక్‌తో మృతి చెందగా శుక్రవారం సర్వారం పీఏసీఎస్ చైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డితో కలిసి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మండల మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ సంతాపం తెలి